# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

TGTEL/25/A0871



తెలంగాణ వెన్నెల వాక్కు

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :41 | 25-08- 2026 | మంగళవారం | పేజీలు: 4 | వెల:03/-




# చేదెక్కిన చక్కెర

## పండుగల వేళ సామాన్యుడిపై తీపి భారం!

నిర్మల్ ఆగష్టు 24 తెలంగాణ వెన్నెల వాక్కు

పండుగల సీజన్ ముంగిట ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో సామాన్య ప్రజల పాలిట నిత్యం తీపిని పంచే పంచదార ఇప్పుడు తీవ్ర చేదు అనుభవాన్ని మిగులుస్తోంది. రాఖీ పౌర్ణమి, వినాయక చవితి, దసరా, దీపావళి వంటి వరుస పండుగలు ప్రారంభమవుతున్న తరుణంలో మార్కెట్‌లో చక్కెర ధరలు అనూహ్యంగా పెరగడం సామాన్య వినియోగదారులతో పాటు చిన్న తరహా వ్యాపారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కేవలం నెల రోజుల కిందటి వరకు రిటైల్ మార్కెట్‌లో కిలో రూ. 42 నుండి రూ. 44 వరకు విక్రయించిన చక్కెర ధరలు, ఇప్పుడు ఏకంగా రూ. 65 నుండి రూ. 70 మార్కును దాటేసి రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఇక హోల్‌సేల్ మార్కెట్‌లో సైతం క్వింటాల్ ధరలు భారీగా పెరగడంతో దానికి అనుగుణంగా రిటైల్ వ్యాపారులు ధరలను పెంచక తప్పడం లేదు.

పండుగల వేళ ఇళ్లలో రకరకాల తీపి వంటకాలు, పిండివంటలు తయారు చేసుకోవడం భారతీయ సంస్కృతిలో భాగం. ఈ క్రమంలో ప్రతీ ఇంట్లో పంచదార వినియోగం సాధారణ రోజుల కంటే దాదాపు 15 శాతం వరకు పెరుగుతుంది. సగటున ఒక కుటుంబానికి నెలకు రెండు నుండి నాలుగు కిలోల వరకు చక్కెర అవసరం కాగా, జిల్లా వ్యాప్తంగా నెలకు 10 నుంచి 12 లక్షల కిలోల వరకు వినియోగం జరుగుతుందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటువంటి పండుగ వాతావరణంలో ఒక్కసారిగా పెరిగిన ధరల వల్ల సామాన్యుడి వంటఇంటి బడ్జెట్‌పై తీవ్రమైన అదనపు భారం పడుతోంది. అనుకోకుండా పెరిగిన ఈ ఖర్చులతో గృహిణులు వంటగది నిర్వహణలో బడ్జెట్ సర్దుబాటు చేసుకోలేక తీవ్ర తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ ధరల మంట కేవలం గృహ వినియోగదారులకే కాకుండా వ్యాపార రంగానికి కూడా విస్తరించింది. ముఖ్యంగా హోటళ్ళు, టీ దుకాణాలు, బేకరీలు, స్వీట్ షాపుల యజమానులపై ఈ పెంపు ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. రోజువారీ వ్యాపారంలో పంచదారను అత్యంత ప్రధాన ముడిసరుకుగా ఉపయోగించే టీ కొట్లు, బేకరీ వ్యాపారులు ఉత్పత్తి వ్యయం ఊహించని విధంగా పెరిగిపోవడంతో లాభాలు తగ్గడమే కాకుండా కొన్ని చోట్ల తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు చక్కెర ధరలు కొద్ది రోజుల్లోనే 50 శాతానికి పైగా పెరగడం, మరోవైపు రాబోయే పండుగల సమయంలో మార్కెట్‌లో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉండటంతో, రాబోయే రోజుల్లో కిలో ధర రూ. 70 దాటి మరింత పైకి చేరుతుందనే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

చక్కెర ధరలు ఈ స్థాయిలో ప్రియం కావడానికి ప్రధానంగా దేశీయంగా ఏర్పడిన చెరుకు ఉత్పత్తి కొరత మరియు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలే కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంధన రంగంలో పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని పెంచేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో చక్కెర మిల్లులు చెరుకు రసాన్ని పూర్తి స్థాయిలో చక్కెర తయారీకి కాకుండా ఇథనాల్ ఉత్పత్తికి మళ్లిస్తున్నాయి. ఇథనాల్ తయారీకి ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్రోత్సాహకాలు లభిస్తుండటంతో ప్రైవేట్ చక్కెర కంపెనీలు సైతం ఇటువైపే మొగ్గు చూపుతున్నాయి.

దీనికి తోడు దేశంలో చెరుకు ఎక్కువగా పండే మహారాష్ట్ర, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాల్లో గత కొన్ని సీజన్లుగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావం వల్ల చెరుకు దిగుబడి గణనీయంగా పడిపోయింది. స్థానికంగా ఉన్న కొన్ని చక్కెర ఫ్యాక్టరీలు సైతం సరైన చెరుకు సరఫరా లేక లేదా ఇతర సాంకేతిక కారణాలతో మూతపడటం పరిస్థితిని మరింత జటిలం చేసింది. పర్యవసానంగా దేశీయంగా చక్కెర నిల్వలు తగ్గిపోయి, తీవ్రమైన డిమాండ్ ఏర్పడటంతో ఇతర దేశాల నుంచి చక్కెరను దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

ఈ పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొంతమంది అక్రమ వ్యాపారులు మార్కెట్‌లో కృత్రిమ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే అవకాశం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ పంచదార భారం గోరుచుట్టుపై రోకటి పోటులా మారింది. పండుగల సీజన్ ముగిసే వరకు వేచి చూడకుండా, ప్రభుత్వం వెంటనే స్పందించి బహిరంగ మార్కెట్‌లో చక్కెర ధరలను అదుపులోకి తెచ్చేందుకు తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రత్యేక దాడులు నిర్వహించి అడ్డుకట్ట వేయాలని, అలాగే పేద కుటుంబాలకు ఊరట కలిగించేందుకు రేషన్ షాపుల ద్వారా రాయితీ ధరకు పంచదారను అందుబాటులోకి తీసుకురావాలని తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.

# పార్టీ క్రమశిక్షణే అధిష్టానం ప్రాధాన్యత!

## కొండా సురేఖ వివాదంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన



హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా అధికార కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపిన రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మరియు ఆమె కుమార్తె కొండా సుస్మిత వ్యాఖ్యల వివాదంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మొదటిసారి స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, ఈ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని, క్రమశిక్షణా కమిటీ మరియు కాంగ్రెస్ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా నాయకులు, కార్యకర్తలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ దానికి కట్టుబడి ఉండాల్సిందేనని ఆయన కరాఖండిగా తేల్చిచెప్పారు.

పార్టీ వేదికలపైనే చర్చలు:

క్రమశిక్షణ కమిటీ నిర్ణయమే శిరోధార్యమని పేర్కొన్న ముఖ్యమంత్రి, మంత్రి కొండా సురేఖ వ్యవహారాన్ని ఇప్పటికే టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ (ఐఅంఎఅజాశ్రీఅఖుతీఎ జశీఎఎఱవవ) క్షుణ్ణంగా పరిశీలిస్తోందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీకి అంతర్గత ప్రజాస్వామ్యంతో పాటు కొన్ని సరిహద్దులు, కఠిన నిబంధనలు ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. “పార్టీకి సంబంధించిన విషయాలు, అంతర్గత విబేధాలు లేదా నేతల అభిప్రాయాలు ఏవైనా ఉంటే సంబంధిత వేదికలపైనే చర్చించుకోవాలి కానీ బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం ఎంతమాత్రం సమంజసం కాదు” అని సీఎం స్పష్టం చేశారు. క్రమశిక్షణా కమిటీ అందించే సమగ్ర నివేదిక ఆధారంగానే తదుపరి చర్యలు ఉంటాయని ఆయన పునరుద్ఘాటించారు.

వివాదానికి దారితీసిన పరిస్థితులు:

ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో నిర్వహించిన మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు వేడుకల్లో ఆమె కుమార్తె కొండా సుస్మిత

2

# తెలంగాణపై కేంద్రం కక్షసాధింపు చర్యలు:

## గుజరాత్ ఆధిపత్యాన్ని ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదు!




హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం పట్ల కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, కేంద్ర నిర్ణయాల వెనుక గుజరాతీ ఆధిపత్యం స్పష్టంగా కానవస్తోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ అధికారిక విదేశీ పర్యటనకు సంబంధించిన అన్ని రకాల పత్రాలను, పర్యటన ఉద్దేశాలను ముందుగానే కేంద్ర విదేశాంగ శాఖకు సమర్పించినప్పటికీ, కేవలం రాజకీయ ప్రయోజనాలు, కక్షసాధింపు చర్యల్లో భాగంగానే తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లండన్ (యూకే) పర్యటనను విజయవంతంగా ముగించుకుని సోమవారం ఉదయం హైదరాబాద్ చేరుకున్న అనంతరం తెలంగాణ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

రాజకీయ కారణాలతోనే అనుమతి నిరాకరణ:

రాష్ట్ర అభివృద్ధి, విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా తమ విదేశీ పర్యటన ఖరారైందని ముఖ్యమంత్రి వివరించారు. “యూకే మరియు అమెరికా పర్యటనలకు ఒకే రకమైన ప్రతిపాదనలను, పత్రాలను విదేశాంగ శాఖకు సమర్పించాం. ఒకే ప్రపోజల్‌లో యూకే టూర్‌కు తక్షణ అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనకు వచ్చేసరికి ‘రాజకీయ కోణం’ ఉందంటూ ఎందుకు నిరాకరించారో ప్రధాని నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలి” అని నిలదీశారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం రేవంత్ రెడ్డి అనే వ్యక్తిపై చేసిన దాడి కాదని, తెలంగాణలోని నాలుగు కోట్ల ప్రజల ప్రయోజనాలను, రాష్ట్ర ఆర్థిక పురోగతిని దెబ్బతీసే కుట్ర అని ఆయన మండిపడ్డారు.

గుజరాత్ సీఎంకు ఒక న్యాయం.. తెలంగాణకు మరొక న్యాయమా?:

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరిపై విమర్శలు గుప్పించిన సీఎం, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు ఎనిమిది రోజుల పాటు అమెరికా, కెనడా పర్యటనలకు తక్షణమే అనుమతులు ఇచ్చారని గుర్తుచేశారు. కానీ తెలంగాణ డెలిగేషన్ అమెరికా పర్యటనకు వెళ్లకుండా కక్షగట్టి అడ్డుకున్నారని దుయ్యబట్టారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటికీ గుజరాత్ ప్రతినిధిగానే

2

# ప్రతిపక్షాలు చెప్పేవన్నీ అబద్ధాలే..

## ప్రజలను భయాందోళనకు గురి చేయడమే వారి పని: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రికార్డ్ ఆఫ్ రైట్స్ చట్టంలోని 22వ అంశం విషయంలో ప్రతిపక్ష నాయకులు అబద్ధాలతో ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించడం పక్కనబెట్టి, వారిని అడ్డం పెట్టుకొని తమ స్వప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. గత నాలుగు వారాల నుంచి ధరణి మరియు పీవోబీ జాబితాపై నిరంతరం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. క్రమబద్ధీకరించిన ఆస్తులు, వివిధ ప్రభుత్వ ఆర్డర్లు మరియు కోర్టు ఉత్తర్వుల ద్వారా హక్కులు పొందిన భూములను క్షుణ్ణంగా పరిశీలించి రెక్టిఫై (సవరణ) చేశామని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్/సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

300 ప్లాట్లలో కేవలం 12, 13 మాత్రమే నిలిపివేశాం

ప్రభుత్వ నియమావళి ప్రకారం నిషేధిత జాబితా (గాదీ)లో ఉన్నప్పటికీ, సరైన రిజిస్ట్రేషన్ మరియు కోర్టు ఆర్డర్ కాపీలు ఉన్న భూములు, ప్లాట్లకు వెంటనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని పొంగులేటి వివరించారు. ఉదాహరణకు సమీక్షించిన 300 ప్లాట్లలో కేవలం 12 నుంచి 13 మాత్రమే భూదాన్, దేవాదాయ మరియు వక్ఫ్ ల్యాండ్ పేరిట నిలిపివేసినట్లు వెల్లడించారు. మిగిలిన అన్నింటికీ సమస్యలు లేకుంటే పరిష్కరిస్తున్నామన్నారు.

కాల్ సెంటర్‌కు 1,162 ఫిర్యాదులు

ప్రజల భూ సమస్యలను స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్‌కు విశేష స్పందన వచ్చిందన్నారు.

ఈ నెల 18న 2 కాల్స్,

19న 168 కాల్స్,

2

# సామాన్యుడికి కన్నీళ్లు... అక్రమార్కులకు ఎర్ర తివాచీ!

## రెవెన్యూ శాఖను అవినీతి రహితంగా మార్చే మార్గమేది?

## కలెక్టరేట్ మెట్లపై బాధితుల కన్నీళ్లు --- అధికారుల కాసుల కక్కుర్తికి చెక్ పెట్టేదెప్పుడు?

ప్రజాపాలనకు అత్యంత కీలకమైన వెన్నెముకగా నిలవాల్సిన రెవెన్యూ శాఖ నేడు నిర్మల్ జిల్లాలో అవినీతి కూపంలో మునిగిపోయింది. సామాన్యుడికి న్యాయం అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు అక్రమార్కులకు, లంచగొండులకు నిలయాలుగా మారిపోయాయనడంలో ఎలాంటి సందేహం లేదు. భూ సమస్యల పరిష్కారం, కుల ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల మంజూరు వంటి ప్రాథమిక బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తించాల్సిన చోట అక్రమాలు నిత్యకృత్యమయ్యాయి. పరిపాలనలో పారదర్శకత కరువై, అధికారులు సొంత ఖజానాలు నింపుకోవడానికే ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చివరకు రక్షిత అటవీ భూములను సైతం వదలకుండా అక్రమంగా పట్టాలు మార్చేసి, ఆ వివాదాలు కోర్టు మెట్లు ఎక్కే వరకు తీసుకెళ్లారంటే రెవెన్యూ శాఖలో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఇది కేవలం ఒక్కటెండు చోట్ల జరుగుతున్న పొరపాటు కాదు, వ్యవస్థాగతంగా పెచ్చరిల్లిన అవినీతి దందానేది స్పష్టమవుతోంది.

రెవెన్యూ అధికారుల లంచాల దాహానికి సామాన్య ప్రజలు, అర్హులైన పేదలు నిలువునా బలైపోతున్నారు. మున్నూరు కాపు వంటి నిర్దిష్ట బీసీ కుల ధ్రువీకరణ పత్రాలను, నిబంధనలకు విరుద్ధంగా ముడుపులు చెల్లించిన ఇతర కులాల వారికి కట్టబెట్టే దందా జిల్లాలో బహిరంగంగానే సాగుతోందనే తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబాల పిల్లలు, కష్టపడి చదువుకునే విద్యార్థులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఎదురుచూసే అర్హులు మీ-సేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పనులు కావడం లేదు. కానీ, లంచాలు ఇచ్చే అక్రమార్కులకు మాత్రం నిమిషాల్లో నకిలీ ధ్రువీకరణ పత్రాలు చేతికి అందుతున్నాయి. ఇది కేవలం ఒక సర్టిఫికెట్ జారీ వ్యవహారం మాత్రమే కాదు; సమాజంలో చట్టబద్ధంగా అర్హులైన వర్గాల రాజ్యాంగబద్ధమైన హక్కులను నిలువునా కాలరాయడమే అవుతుంది. నాణ్యమైన విద్య, ఉద్యోగ అవకాశాల్లో అసలైన అర్హులకు తీరని అన్యాయం జరుగుతున్నా యంత్రాంగం కళ్లప్పగించి చూడటం శోచనీయం.

మరోవైపు నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను సృష్టించి, అసలైన భూయజమానుల పట్టాలను మార్చేస్తూ అక్రమ ధారదత్తాలు చేస్తున్నారు. తమ ప్రాణాల కంటే మిన్నగా భావించే భూములను నమ్ముకుని జీవించే అమాయక రైతుల రికార్డులను రాత్రికి రాత్రే మార్చేసి, రియల్ ఎస్టేట్ మాఫియాతో చేతులు కలిపి అధికారులు కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. తరతరాలుగా వస్తున్న స్వార్జిత భూమిని కాపాడుకోవడానికి బాధితులు ఏకంగా కలెక్టరేట్ ప్రాంగణం ముందు ధర్నాలకు దిగి కన్నీళ్లు పెట్టుకునే పరిస్థితి వచ్చిందంటే, జిల్లాలో క్షేత్రస్థాయి పరిపాలన ఎంతగా దిగజారిపోయిందో స్పష్టమవుతోంది. రైతులకు రక్షణగా నిలవాల్సిన శాఖయే వారి పొలాలను ఆక్రమణదారులకు అప్పగిస్తుంటే సామాన్యుడు ఎవరికి చెప్పుకోవాలి?

అవినీతిని సహించేది లేదని, జిల్లా పాలనను పారదర్శకంగా నడుపుతామని ఉన్నతాధికారులు వేదికలెక్కి చెప్పే ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న దందాలకు అస్సలు పొంతన కుదరడం లేదు. ఒకపక్క అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు వరుస దాడులు చేస్తూ లంచగొండి అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నా, క్రింది స్థాయి సిబ్బందిలో ఏమాత్రం భయం బెండూ కానరాకపోవడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఏడాది తిరగకుండానే ఒకే శాఖ అధికారులు పదేపదే ఏసీబీకి దొరికిపోతున్నారంటే, చట్టం పట్ల వారికి ఉన్న నిర్లక్ష్యం ఎంతో తేటతెల్లమవుతోంది. జిల్లా పాలనాధికారి అడ్మినిస్ట్రేటివ్ కంట్రోల్ పూర్తిగా విఫలమైందనడానికి ఈ పరిస్థితులే ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయి. మండల స్థాయిలో తహసీల్దార్లు, రెవెన్యూ అసిస్టెంట్లు, సర్వేయర్లు ఒక ముఠాగా ఏర్పడి సాగిస్తున్న అక్రమాల వల్ల, జిల్లా ఉన్నతాధికారుల పేర్లు కూడా మసకబారుతున్నాయి.

ఈ అక్రమాల వెనుక బలమైన ముఠా సంస్కృతి దాగి ఉందనేది నమ్మలేని నిజం. క్రింది స్థాయి నుంచి పైస్థాయి వరకు మామూళ్ల వాటాలు క్రమం తప్పకుండా అందుతున్నాయనే ఆరోపణల వల్లే అక్రమ ఫైళ్లు కన్నుమూసి కన్నుతెరిచేలోగా ఆమోదం పొందుతున్నాయి. జిల్లా స్థాయి అధికారులు కేవలం ఏసి గదుల్లో సమీక్షలకే పరిమితమై, వివాదాస్పద భూములు, సర్టిఫికెట్లపై క్షేత్రస్థాయి భౌతిక తనిఖీలు చేయకపోవడం అవినీతిపరులకు పెద్ద వరంగా మారింది. దీనికి తోడు ఏసీబీకి పట్టుబడిన అధికారులపై సుదీర్ఘ కాలయాపన జరగడం, విచారణల పేరుతో సమయం వృధా చేస్తూ కేవలం సస్పెన్షన్లు, దూర ప్రాంతాలకు బదిలీల చర్యలతో సరిపెట్టడంతో “మాకేం కాదులే, కొన్నాళ్లకు మళ్లీ పోస్టింగ్ వస్తుంది” అనే ధీమా లంచగొండుల్లో మరింత పెరిగిపోయింది.

ఈ అవినీతి రాక్షస రాజ్యానికి చెక్ పెట్టాలంటే జిల్లా యంత్రాంగం తక్షణమే విప్లవాత్మకమైన, కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. నకిలీ సర్టిఫికెట్లు, అక్రమ అటవీ భూపట్టాలు జారీ చేసిన అధికారులను కేవలం బదిలీలతో వదిలేయకుండా తక్షణమే విచారణ వేగవంతం చేసి ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేయాలి. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అక్రమంగా సంపాదించిన ఆస్తులను జప్తు చేయాలి. అలాగే అటవీ భూములు, ప్రభుత్వ స్థలాల రికార్డుల మార్పిడికి ముందు ఫారెస్ట్, రెవెన్యూ శాఖల సంయుక్త శాటిలైట్ మ్యాపింగ్ తనిఖీలు తప్పనిసరి చేసి, వివాదాస్పద నిర్ణయాలపై ఒక ప్రత్యేక బృందంతో స్పెషల్ ఆడిట్ జరపడం తక్షణ అవసరం.

అదేవిధంగా కుల, ఫ్యామిలీ సర్టిఫికెట్లు, భూరికార్డుల మార్పిడిలో అధికారులకు ఉన్న పరిమితి లేని అధికారాలను నియంత్రించి, మానవ ప్రమేయాన్ని తగ్గించే పారదర్శక ఆన్‌లైన్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలి. బాధిత ప్రజలు రోడ్లెక్కి కలెక్టరేట్ ముందు ధర్నాలు చేసే దుస్థితి రాకుండా, ప్రతి వారం పజావాణి లేదా ప్రత్యేక దర్బార్ నిర్వహించి ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ నేరుగా స్పందించాలి. బాధ్యులైన అధికారులకు అక్కడికక్కడే శిక్షలు విధించే కఠినమైన యంత్రాంగాన్ని పునరుద్ధరించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో రెవెన్యూ శాఖ పట్ల ప్రజలకు నమ్మకం సడలిపోతే మొత్తం పాలనా యంత్రాంగంపైనే విశ్వాసం దెబ్బతింటుంది. ఇప్పటికైనా జిల్లా యంత్రా ంగం నిద్రమత్తు వదిలి స్పందించాలి. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, అవినీతి రాబందుల పట్ల “జీరో టాలరెన్స్” విధానాన్ని కఠినంగా అమలు చేసి బాధితు లకు న్యాయం చేయాల్సిన పూర్తి బాధ్యత జిల్లా కలెక్టర్ పైనే ఉంది.



**వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**

# పండుగలు మారుతున్నాయా?

## పండుగ వెనుక ఉన్న అసలు ఆనందాన్ని మనం కోల్పోతున్నామా?

పండుగ అంటే ఒకప్పుడు ఇంట్లో ప్రత్యేకమైన సందడి. కొత్త బట్టలు, ఇంటి శుభ్రత, పిండివంటలు, బంధువుల రాక, పెద్దల ఆశీర్వాదాలు, పిల్లల ఆనందంతో ప్రతి ఇంట్లో ఆత్మీయ వాతావరణం కనిపించేది. ఇప్పుడు కాలం మారింది. జీవనశైలి మారింది. కుటుంబాలు చిన్నవయ్యాయి. ఉద్యోగాల కోసం పిల్లలు దూర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. పండుగలు వస్తున్నాయి.. వెళ్తున్నాయి. కానీ గతంలో కనిపించిన ఆ ఆత్మీయత మాత్రం కొంత తగ్గుతున్నట్లు అనిపిస్తోంది.

అసలు మారింది పండుగలా? లేక మనుషుల జీవన విధానమా? సాంకేతికత మన జీవితాన్ని సులభం చేసింది. కానీ పండుగను అనుభవించడం కంటే దాన్ని ఫొటోలు, వీడియోల ద్వారా చూపించడంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాం. పండుగ రోజు కుటుంబంతో మాట్లాడటం కంటే ఫోన్‌లో గడిపే సమయం పెరుగుతోంది. ఇతరుల పండుగను చూసి మన పండుగను పోల్చుకోవడం కూడా పెరిగింది. దీంతో పండుగలోని సహజమైన ఆనందం క్రమంగా ప్రదర్శనగా మారే ప్రమాదం కనిపిస్తోంది.

నిజానికి ప్రతి పండుగ వెనుక ఒక జీవన సందేశం ఉంటుంది. కుటుంబ బంధాలను గుర్తు చేయడం, పెద్దలను గౌరవించడం, ప్రకృతిని ఆదరించడం, మంచి చెడుల మధ్య తేడాను గుర్తించడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం వంటి విలువలను మన పూర్వీకులు పండుగలతో అనుసంధానించారు. ఆ విలువలను మరిచి కేవలం ఆచారాలను కొనసాగిస్తే పండుగ రూపం మాత్రమే మిగులుతుంది.. అసలు భావం దూరమవుతుంది.

పండుగ రోజు మన ఇంట్లో వంటలు చేసుకోవడం ఎంత ఆనందమో.. పక్కింటి ఒంటరి వృద్ధుడిని పలకరించడం కూడా అంతే ఆనందం. మన పిల్లలకు కొత్త బట్టలు కొనడం ఎంత ముఖ్యమో.. పండుగ ఎందుకు జరుపుకుంటున్నామో చెప్పడం కూడా అంతే ముఖ్యం. మన ఇంట్లో దీపం వెలిగించడం ఎంత పవిత్రమో.. మరొకరి జీవితంలో చిన్న వెలుగు నింపడం అంతకంటే గొప్పది.

ఆధునికతను స్వీకరించడంలో తప్పు లేదు. పండుగలను కొత్త పద్ధతిలో జరుపుకోవచ్చు. కానీ పద్ధతి మారినా.. పండుగ వెనుక ఉన్న ప్రేమ, ఆత్మీయత, భక్తి, కుటుంబ బంధాలు, మానవత్వం మాత్రం మారకూడదు. ఎందుకంటే పండుగలు కేవలం క్యాలెండర్‌లో వచ్చే రోజులు కాదు.. కుటుంబాలను కలిపే సందర్భాలు, తరాలను కలిపే వారధులు.

పండుగలో వెలిగించే దీపం ఒక రాత్రిని మాత్రమే వెలిగిస్తుంది. కానీ పండుగ మనలో వెలిగించే విలువలు ఒక తరాన్ని వెలిగించగలవు. ఆ విలువలను కాపాడుకున్నప్పుడే మన పండుగలకు నిజమైన అర్థం ఉంటుంది.



**--- సీనియర్ జర్నలిస్ట్**
**యోగేష్ కుమార్**

# పార్టీ క్రమశిక్షణే అధిష్టానం ప్రాధాన్యత!

మాట్లాడిన మాటలు కాంగ్రెస్ వర్గాల్లో సంచలనంగా మారాయి. పరకాల నియోజకవర్గ పరిధిలో రాబోయే శాసనసభ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే మళ్లీ పోటీ చేసే అవకాశం కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి సంకేతాలివ్వడంపై సుస్మిత బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. పరకాల నుంచి రాబోయే ఎన్నికల్లో తానే కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తానని, ఒకవేళ పార్టీ టికెట్ నిరాకరిస్తే స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలోకి దిగుతానని ఆమె వ్యాఖ్యానించారు. దీనికితోడు సీఎం రేవంత్ రెడ్డి, ఆయన నాయకత్వంపై పరోక్షంగా విమర్శలు చేయడంతో ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారానికి దారితీసింది.వివరణ కోరిన టీపీసీసీ - నోటీసుపై సురేఖ స్పందన:ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి, మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ వివరణ కోరారు. దీనికి స్పందిస్తూ మంత్రి కొండా సురేఖ క్రమశిక్షణా కమిటీకి లిఖితపూర్వక వివరణ అందజేశారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని, వాటితో తనకు లేదా తన రాజకీయ నిర్ణయాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కుటుంబ బంధాలను ఆసరాగా చేసుకుని మరొకరి వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ తనపై ఇచ్చిన నోటీసును ఉపసంహరించుకోవాలని కమిటీని కోరారు.అధిష్టానం నిర్ణయంపై ఉత్కంఠ:ప్రస్తుతం కొండా సురేఖ ఇచ్చిన లిఖితపూర్వక వివరణ క్రమశిక్షణా కమిటీ పరిశీలనలో ఉందని సీఎం స్పష్టం చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది సంచలనంగా మారింది. ప్రభుత్వ ప్రతిష్టను, పార్టీ క్రమశిక్షణను కాపాడే క్రమంలో హైకమాండ్ తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. క్రమశిక్షణా కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా కాంగ్రెస్ అధిష్టానం

# తెలంగాణపై కేంద్రం కక్షసాధింపు చర్యలు:

ఆలోచిస్తున్నారని, దేశ ప్రధానిగా అన్ని రాష్ట్రాలను సమానంగా చూడటం లేదని విమర్శించారు. ‘తెలంగాణ రైజింగ్ 2047’ చొరవ ద్వారా తెలంగాణకు అంతర్జాతీయంగా భారీగా ఇన్వెస్ట్‌మెంట్లు వస్తే గుజరాత్‌కు వెళ్లే పెట్టుబడులు తగ్గిపోతాయనే కుట్రపూరితమైన భయంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు.

రాష్ట్ర బీజేపీ ఎంపీల వైఖరిపై ధ్వజమెత్తు:

తెలంగాణ అభివృద్ధిని కేంద్రం అడ్డుకుంటున్నా రాష్ట్రానికి చెందిన బీజేపీ ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం విచారకరమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. “రాష్ట్ర ప్రజల ఓట్లతో గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు తెలంగాణ ప్రయోజనాల కోసం కాకుండా గుజరాత్ ఆధిపత్యానికే ఊడిగం చేస్తున్నారా?” అని సూటిగా ప్రశ్నించారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణపై చూపుతున్న ఈ వివక్షను, ఆధిపత్య ధోరణిని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనపై ఇలాంటి దిగజారుడు రాజకీయం చేయడం సమాఖ్య వ్యవస్థకే ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

పార్లమెంట్‌లో గళమెత్తుతాం:

కేంద్ర ప్రభుత్వం చూపిన ఈ తీవ్ర వివక్షపై కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఉభయ సభల్లో నిలదీస్తుందని సీఎం రేవంత్ తెలిపారు. తమ విదేశీ పర్యటనను అడ్డుకున్నంత మాత్రాన రాష్ట్ర అభివృద్ధి ఆగిపోదని, త్వరలోనే నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచవ్యాప్త పెట్టుబడులను తెలంగాణకు ఆకర్షించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ప్రతిపక్షాలు చెప్పేవన్నీ అబద్ధాలే..

20న 200 కాల్స్,
21న 369 కాల్స్,
22న 309 కాల్స్ వంతున ఇప్పటివరకు మొత్తం 1,162 కాల్స్ వచ్చాయని మంత్రి తెలిపారు.

వచ్చిన మొత్తం ఫిర్యాదులలో అగ్రికల్చర్ (వ్యవసాయ) భూములకు సంబంధించినవి 612 ఉండగా, నాన్-అగ్రికల్చర్ (వ్యవసాయేతర) ఆస్తులకు సంబంధించినవి 542 ఉన్నాయని ఆయన వెల్లడించారు. వీటిలో ఒకే అంశంపై పదేపదే వచ్చిన ఓవర్‌ల్యాపింగ్ కాల్స్‌ను తొలగించగా నికరంగా 980 కాల్స్ నమోదు అయ్యాయని తెలిపారు. విశ్లేషిస్తే అందులో వ్యవసాయ రంగానికి సంబంధించి 547, వ్యవసాయేతర రంగానికి సంబంధించి 433 కాల్స్ ఉన్నట్లు రికార్డు అయ్యామని చెప్పారు.

జిల్లాల వారీగా పరిశీలిస్తే రంగారెడ్డి జిల్లా నుంచి అత్యధికంగా 258 కాల్స్ రాగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి 249, సంగారెడ్డి జిల్లా నుంచి 82, మరియు కామారెడ్డి జిల్లా నుంచి 41 కాల్స్ వచ్చాయన్నారు.

ఫాస్ట్ ట్రాక్ ద్వారా పీవోబీ తొలగింపు

టోల్ ఫ్రీ మరియు ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతీ వినతిని ఆయా జిల్లాల కలెక్టర్లకు వెంటనే ఫార్వర్డ్ చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించామన్నారు. భూ సమస్యలపై బాధితులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హత కలిగిన ప్రతి ఆస్తిని ఫాస్ట్ ట్రాక్ (త్వరితగతిన) ద్వారా పీవోబీ జాబితా నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు ఆయన మీడియా వేదికగా స్పష్టం చేశారు. రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసి ప్రజలకు సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు.

# కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో మరో ముగ్గురి అరెస్ట్..

హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అడవులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాజీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ూుణ) ఎన్. సుమంత్‌పై నమోదైన తీవ్రమైన దాడి, భారీ మొత్తంలో కప్పం డిమాండ్ కేసులో పోలీసుల దర్యాప్తు మరింత వేగవంతమైంది. రాజకీయ, వ్యాపార వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన ఈ హైప్రొఫైల్ కేసులో ఖైరతాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు సమర్థవంతంగా వ్యవహరించి మరో ముగ్గురు కీలక నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా మార్టూరు సమీపంలో నిఘా పెట్టి ఈ ముగ్గురిని టాస్క్ ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. అరెస్టయిన నిందితులను అరుణ్ కుమార్, ముత్యాల మహేందర్ రెడ్డి, కార్తీక్‌లుగా పోలీసులు అధికారికంగా గుర్తించారు.

పట్టుబడిన నిందితులను తదుపరి చట్టపరమైన విచారణ మరియు రిమాండ్ నిమిత్తం జూబ్లీహిల్స్ లా అండ్ ఆర్డర్ పోలీసులకు అప్పగించారు. ఈ తాజా అరెస్టులతో ఈ బెదిరింపు మరియు హత్యాయత్నం కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి మొత్తం సంఖ్య నాలుగుకు చేరింది. అంతకుముందు తెల్లాపూర్ సమీపంలోని సుమంత్ నివాస ప్రాంగణంలో అతడి వ్యక్తిగత డ్రైవర్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించిన సంగతి తెలిసిందే.

ఈ కేసు పూర్వాపరాల్లోకి వెళితే.. బాధితుడు, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగడి హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కేసు తీవ్రత బయటపడింది. గత జులై నెల చివరి వారంలో సుమంత్ తనను అత్యవసరంగా కలవాలని పిలిచారు. సుమంత్ పిలుపు మేరకు హరికృష్ణ జూబ్లీహిల్స్‌లోని సుమంత్ సహాయకుడి కార్యాలయానికి వెళ్లారు. అయితే అక్కడికి చేరుకున్న వెంటనే సుమంత్ మరియు అతని అనుచరులైన ప్రశాంతి, రాము, అరుణ్ కుమార్ రెడ్డి, కార్తీక్, మహేందర్ రెడ్డిలతో పాటు మరికొందరు హరికృష్ణను చుట్టుముట్టారు.అనంతరం తమకు రూ. 10 కోట్లు ఇవ్వాలని, లేకపోతే ప్రాణాలతో వదలేది లేదని బెదిరింపులకు దిగారు. బాధితుడు నిరాకరించడంతో ఇనుప రాడ్లు, బారీ కర్రలతో అతడిపై దారుణంగా భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో హరికృష్ణ ఎడమచేయి విరగడంతో పాటు శరీరంపై తీవ్రమైన రక్తగాయాలయ్యాయి. నిందితుల బారి నుంచి ఎలాగోలా బయటపడిన హరికృష్ణ, ప్రాణభయంతో వెంటనే సమీపంలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

ఘటన జరిగిన ప్రాంతం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రావడంతో, మేడిపల్లి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ (వతీశీ ఖీ×=) నమోదు చేసి తదుపరి చర్యల కోసం కేసును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు భారతీయ న్యాయ సంహిత (దీచీూ)లోని తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ముఖ్యంగా హత్యాయత్నం (దీచీూ ూవష్ఱశీఅ 109), బలవంతపు వసూళ్లు (జుఞ-శీ‌తీ‌ఱశీఅ), అక్రమబంధనం, మరియు ప్రాణాంతక ఆయుధాలతో దాడి చేయడం వంటి తీవ్రమైన నేరాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పరారీలో ప్రధాన నిందితుడు సుమంత్.. కొనసాగుతున్న గాలింపు

ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మంత్రి మాజీ ఓఎస్డీ సుమంత్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. పోలీసు కేసు నమోదు కాగానే అతడు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. సుమంత్‌తో పాటు దాడిలో పాల్గొని పరారీలో ఉన్న మిగిలిన నిందితుల ఆచూకీ కనుగొనేందుకు హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో ప్రత్యేక పోలీస్ బృందాలు రంగంలోకి దిగాయి. సుమంత్ వినియోగిస్తున్న ఫోన్ సిగ్నల్స్, ప్రయాణించిన వాహనాల ఆధారంగా గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

# వన మహోత్సవం లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలి

నిర్మల్, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): వన మహోత్సవం కింద నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలు, జియో ట్యాగింగ్ పురోగతిపై ఆరా తీశారు.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున మంగళవారం అన్ని జిల్లాల్లో విస్తృతంగా మాస్ ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టాలని మంత్రి సూచించారు. విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలను భాగస్వాములను చేస్తూ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అర్బన్ ఫారెస్ట్ పార్కులలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని దిశానిర్దేశం చేశారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, రక్షణ కంచెలు ఏర్పాటు చేసి తప్పనిసరిగా జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించి జిల్లాలో మాస్ ప్లాంటేషన్ విజయవంతం చేయాలని ఆదేశించారు. అటవీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.




ఈ వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 97 రద్దు చేయాలి

## నిర్మల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పీడీఎస్యూ, టీజీవీపీ నిరసన

నిర్మల్, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యను శక్తి పాలసీ పేరుతో ప్రైవేట్ స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేస్తూ తెచ్చిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. నిర్మల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పీడీఎస్యూ, టీజీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు వేర్వేరుగా జీవో ప్రతులను దగ్ధం చేసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.



పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు సింగారి వెంకటేష్ మాట్లాడుతూ సాంకేతిక విద్యను ఒకేషనల్ స్థాయికి కుదించడం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ స్కిల్ వర్సిటీల్లో చేర్చడం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులపై ఫీజుల భారం తీవ్రంగా పడుతుందన్నారు.

టీజీవీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక విద్యా మండలి వ్యవస్థను బలహీనపరిచే చర్యలను విరమించుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో నూతన ప్రయోగశాలలు, మౌలిక వసతులు కల్పించి, ఖాళీ అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే విధానాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమాల్లో విద్యార్థి సంఘాల నాయకులు రాజ్, శ్రీహరి, రమేష్, వసంత్, శివప్రసాద్, ప్రణయ్, గణేష్, ఆత్మరామ్ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేజీబీవీ వర్కర్లకు రాత్రి విధులు రద్దు చేయాలి: టీయూసీఐ

## సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్‌లో వినతిపత్రం

నిర్మల్, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది, వర్కర్లకు రాత్రి విధులను రద్దు చేయాలని, వారాంతపు సెలవులను సక్రమంగా అమలు చేయాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.




యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ మాట్లాడుతూ కేజీబీవీలలో పనిచేసే అకౌంటెంట్లు, వర్కర్లకు నిర్దేశిత జాబ్ చార్ట్ కంటే ఎక్కువ పని చేయిస్తూ తీవ్ర పనిభారానికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో విధులు కేటాయించడం వల్ల మహిళా కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

కార్మికులందరికీ వారానికి ఒకరోజు తప్పనిసరి సెలవు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలను వెంటనే వర్తింపజేసి, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై స్పందించిన కలెక్టర్, నిబంధనల ప్రకారం వారాంతపు సెలవులు అమలు చేయాలని విద్యాశాఖను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. రాజన్న, కేజీబీవీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రూప, కవిత, నాయకులు లక్ష్మి, సుష్మ, భాగ్యలక్ష్మి, సాహిదా, గంగామణి, స్వప్న పాల్గొన్నారు.

# ధర్మసాగర్ చెరువు ఆక్రమణలపై సమగ్ర నివేదిక ఇవ్వాలి: కలెక్టర్

## ఆమ్ ఆద్మీ పార్టీ వినతితో విచారణకు ఆదేశం

నిర్మల్, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలోని చారిత్రాత్మక ధర్మసాగర్ చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ ఆక్రమణలపై రెండు వారాల్లో క్షేత్రస్థాయి విచారణ జరిపి సమగ్ర నివేదిక సమర్పించాలని నీటిపారుదల శాఖ ఈఈని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ ఇచ్చిన అప్పీల్‌పై కలెక్టర్ స్పందించారు.



గతంలో ఇచ్చిన ఫిర్యాదుకు అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వకుండా ఇతర చెరువుల జాబితా ఇచ్చి పక్కదారి పట్టించారని సయ్యద్ హైదర్ పేర్కొన్నారు. చెరువు గర్భంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సంయుక్త సర్వే నిర్వహించి హద్దులు తేల్చాలన్నారు. అధికారులు నిర్దిష్ట గడువులోగా నివేదిక ఇవ్వకపోతే ప్రజా పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆప్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పారుపల్లిలో బీసీ ఎస్సీ ఎస్టీ హక్కులపై అవగాహన సదస్సు

లక్ష్మణచాంద, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): మండలంలోని పారుపల్లి, పారుపల్లి తండా గ్రామాల్లో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ గ్రామ కమిటీల ఏర్పాటుపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన ఉద్యమ లక్ష్యాలు, బహుజన వర్గాల ఐక్యత, సామాజిక న్యాయం ఆవశ్యకతను నాయకులు ప్రజలకు సమగ్రంగా వివరించారు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం, విద్యా, వైద్య, ఉపాధి రంగాల్లో న్యాయమైన వాటా దక్కేలా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి కమిటీలను పటిష్టం చేసి ప్రజల్లో నిరంతర చైతన్యం తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ముద్రబోయిన వినేష్ ముదిరాజ్, బొజ్జ అశోక్, మండల అధ్యక్షుడు సుంకరి సురేష్, ఉపాధ్యక్షుడు జుంజుర్ గోవర్ధన్, కార్యదర్శి భీమర్తి ప్రవీణ్, యువజన కన్వీనర్ సందీప్, నాయకులు కొండ్ర సాయందర్, గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



# స్వర్ణ వాగుపై వంతెన నిర్మించాలని ప్రజావాణిలో వినతి

సారంగాపూర్, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): సారంగాపూర్ మండలం యాకర్పల్లి నుంచి వంజర్ గ్రామాన్ని కలుపుతూ స్వర్ణ వాగుపై లో లెవల్ వంతెన నిర్మించాలని కోరుతూ సర్పంచ్, గ్రామస్తులు మండల ప్రజావాణిలో తహశీల్దార్‌కు లిఖితపూర్వక వినతిపత్రం అందజేశారు. యాకర్పల్లి నుంచి వంజర్ గ్రామానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ వాగుపై వంతెన లేకపోవడంతో రైతులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. వాగు అవతల సుమారు నాలుగు వందల ఎకరాల పంట భూములు ఉన్నాయని, వర్షాకాలంలో నీటి ఉధృతి పెరిగి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని వాపోయారు. అలాగే గంగనీళ్ల జాతర సమయంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ వంతెన నిర్మిస్తే పలు గ్రామాల ప్రజలకు ఆదిలాబాద్, భైంసా వైపు రాకపోకలకు దూరం ఎంతో తగ్గుతుందని వివరించారు.



# తెలంగాణలో బహుజనుల రాజ్యం రావాలి: డాక్టర్ కదిరి కృష్ణ

నిర్మల్, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ రాష్ట్రంలో బహుజనుల రాజ్యం ఏర్పడినప్పుడే సబ్బండ వర్గాల ప్రజలకు నిజమైన సామాజిక న్యాయం చేకూరుతుందని బహుజన సేన వ్యవస్థాపకుడు డాక్టర్ కదిరి కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో జరిగిన ముఖ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పాలనాధికారాలు దక్కాలని, శ్రామిక శక్తిని దోపిడీ చేస్తున్న పెత్తందారీ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకుల తీరును ఎండగడుతూ బహుజన సేన ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బ్లూ ఆర్మీ రాష్ట్ర నాయకుడు రాజేష్ రక్షక్, హైకోర్టు న్యాయవాది చంద్రశేఖర్, బీసీ ఉద్యమ నాయకుడు కుమ్మరి నారాయణ, శంకర్ రావు, రవీందర్, రాజ్ కుమార్, అడ్వకేట్ రాసమల్ల అశోక్, రాకేష్, సంగర్తి రాజన్న పాల్గొన్నారు.




# బాసర మండల పరిషత్ పాఠశాలలో కంప్యూటర్ తరగతులు ప్రారంభం

బాసర, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అత్యాధునిక కంప్యూటర్ శిక్షణా తరగతులను ఘనంగా ప్రారంభించారు. మూడు, నాలుగు, ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకు ప్రత్యేకంగా కంప్యూటర్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు మమ్మాయి శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య డెబ్బై మూడు నుంచి నూట యాభైకి పైగా పెరిగిన తరుణంలో చిన్నారులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయడం ఎంతో సంతోషకరమన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐటీడీఏ ముట్టడి

## చట్టబద్ధ హక్కుల అమలు కోసం గర్జించిన ఆదివాసీ సంఘాలు



ఉట్నూరు, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆదివాసీల భూమి, అడవి, అస్తిత్వం, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసీ సంఘాలు సోమవారం ఉట్నూర్‌లో భారీ నిరసన ప్రదర్శన చేపట్టాయి. ఆదివాసీ హక్కుల పోరాట సమితి -- తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గోడం గణేష్, సిడాం జంగుదేవ్ పటేల్ అధ్యక్షతన నిర్వహిం చిన ఐటీడీఏ కార్యాలయ ముట్టడి కార్యక్రమం విజయవం తమైంది. భారీ పోలీసు బందోబ స్తునడుమ ఆదివాసీ ప్రజలు, యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు వేలాదిగా తరలివచ్చారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ ఆదివాసీలు ప్రభుత్వాల వద్ద దయాదాక్షిణ్యాలు అడగడం లేదని, రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులను మాత్రమే అమలు చేయాలని కోరుతున్నామని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టం, పీసా నిబంధనలను కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు భూములు సాగు చేసుకుంటున్న అర్హులందరికీ వెంటనే పట్టాలు జారీ చేయాలన్నారు.
పులుల సంరక్షణ కేంద్రాలు, బఫర్ జోన్ల పేరిట ఆదివాసీ గూడాలను ఖాళీ చేయించే కుట్రలను తక్షణమే విరమించుకోవాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పోలీసు ఉద్యోగాల్లో ఆదివాసీలకు డెబ్బై ఐదు శాతం రిజర్వేషన్ కల్పించే జీవో నంబర్ 109ను అమలు చేయాలని, ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నూట ఇరవై రాయి సెంటర్లకు పక్కా భవనాలు మంజూరు చేయాలన్నారు.
ఆదివాసీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమణ, లక్ష్మయ్య, కాబ్బాక శ్రావణ్, వట్టం జనార్దన్, గంట సత్యం, గంజి రాజన్న, కొడప సోనేరావు, కొడప నగేష్, మాడవి వెంకటేష్, కుర్సెంగా వెంకటేష్, వెట్టి మనోజ్, పెందూర్ త్రిమూర్తి, సోయం చిన్నయ్య, మధుకర్, వరుణ్, విష్ణు, సుదర్శన్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఏసీబీ దాడులు

## యాభై వేల రూపాయల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారులు



నిర్మల్, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఓ స్థానిక వ్యాపారికి సంబంధించి పన్ను మొత్తాన్ని తగ్గించేందుకు యాభై వేల రూపాయల లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా ఇద్దరు అధికారులను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
వాణిజ్య పన్నుల శాఖ అధికారి (డీసీటీఓ) గోదావరి, సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయికృష్ణ ఓ వ్యాపారి నుంచి పన్ను మినహాయింపు కోసం లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధిత వ్యాపారి అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, కార్యాలయంలో వ్యాపారి నుంచి యాభై వేల రూపాయల నగదు తీసుకుంటుండగా డీసీటీఓ గోదావరి, సీనియర్ అసిస్టెంట్ సాయికృష్ణలను పట్టుకున్నారు. వారి నుంచి రసాయన పరీక్షల ద్వారా నగదును స్వాధీనం చేసుకుని వివరాలు నమోదు చేశారు.
అవినీతికి పాల్పడిన అధికారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# ముథోల్‌లో విద్యార్థినులకు హాస్టళ్లు ఏర్పాటు చేయాలి



ముథోల్, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముథోల్ మండల కేంద్రంలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న గ్రామీణ విద్యార్థినుల కోసం నూతన బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో ఎంపీడీవో లవకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బస్సు సౌకర్యాలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే శిథిలావస్థకు చేరిన సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని కోరారు.

# పుట్టినరోజున పాఠశాలకు కుర్చీలు బహూకరించిన కానిస్టేబుల్



బాసర, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర మండల పరిధిలోని కీర్గుల్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు కానిస్టేబుల్ రాజు తన కుమార్తె సాక్షర పుట్టినరోజు సందర్భంగా సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన కుర్చీలను బహూకరించారు. పాఠశాలలో కుర్చీల కొరత ఉందని తెలుసుకుని ఆడంబరాలకు దూరంగా ఈ సహాయం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు రావళిక, భవాని సమక్షంలో అందజేశారు. కానిస్టేబుల్ సేవా భావాన్ని ఉపాధ్యాయులు, స్థానికులు ప్రశంసించారు.

# బాసరలో బల్గం నాగయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

బాసర, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర మండల కేంద్రంలోని బోర్ర గణేష్ దేవాలయం వద్ద బల్గం నాగయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూర్వీకుల సేవా స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా సమాజ సేవలు ప్రారంభించినట్లు అధ్యక్షుడు బల్గం పవన్ కుమార్ తెలిపారు. భక్తులు, స్థానిక గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, క్రాంతి, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.



# బాసర కృష్ణాష్టమి వేడుకల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



బాసర, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర క్షేత్ర సమీపంలోని గోదావరి తీరంలో గల శ్రీకృష్ణ దేవాలయం వద్ద వచ్చే నెల నాలుగున నిర్వహించనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకల గోడ పత్రికను ఆలయ అధ్యక్షుడు భుమానన్ మహారాజ్, పంచాయతీ కార్యనిర్వహణ అధికారి ప్రసాద్ గౌడ్ ఆవిష్కరించారు . శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే ఉత్సవం (దహి హండీ) నిర్వహిం చనున్నట్లు తెలిపారు. చిన్నారులకు శ్రీకృష్ణుడి వేషధారణ పోటీలు, భక్తి సంగీత విభావరి, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు, గ్రామ ప్రజలు విశేష సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు జిడ్డు సుభాష్ యాదవ్, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# పీఆర్‌టీయూ సారంగాపూర్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

సారంగాపూర్, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): సారంగాపూర్ మండల కేంద్రంలో పీఆర్‌టీయూ నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా అనుముల రఘునాథ్, అసోసియేట్ అధ్యక్షులుగా కూన గంగాసాగర్, జి. వరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా రమేష్ చంద్ర గౌడ్, సుశీల ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా శ్రీధర్ బాబు, నవీన్, రజని, జయశ్రీ బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



# గుండెగాం ముంపు గ్రామానికి శాశ్వత పునరావాసం కల్పించాలి



భైంసా, ఆగస్టు 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): భైంసా మండలంలోని ముంపు ప్రాంతమైన గుండెగాం గ్రామానికి ప్రభుత్వం వెంటనే శాశ్వత పునరావాసం కల్పించాలని గ్రామ యువకుడు నామత్కర్ నవీన్ డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా గ్రామ ప్రజలు ఎన్నో ధర్నాలు, ఆందోళనలు చేపట్టి అధికారులకు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. వర్షాకాలం వచ్చిందంటే వరద నీరు ఊర్లోకి చేరి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవించాల్సి వస్తోందన్నారు. సిద్ధూర్ రోడ్డు వద్ద కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోనూ కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి శాశ్వత పునరావాసం కల్పించకపోతే కలెక్టరేట్, సెక్రటేరియట్ ముట్టడికి వెనుకాడబోమని హెచ్చరించారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com